# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ

పత్రికా ప్రకటన

మే 20, 2012

## బస్తర్‌లో భారతీయ సైన్యం 'శిక్షణ'ను నిలిపి వెయ్యాలి! సైన్యాన్ని వెనక్కి పంపించాలి!

## దేశ ప్రజలపై సాగుతున్న అన్యాయ యుద్ధం - ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపివెయ్యాలి!

## జూన్ 1 నుండి 7 వరకు దండకారణ్యమంతటా 'నిరసన వారం',

## జూన్ 7న 'దండకారణ్య బంద్'ను విజయవంతం చెయ్యండి!

గత రెండున్నర ఏళ్లుగా దేశంలోని అత్యంత అణగారిన ప్రజలపై దోపిడీ పాలకవర్గాలు ఒక యుద్ధం సాగిస్తున్నాయి. దీన్ని ఒక్కోసారి 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'గా చెబుతూ, మరి కొన్ని సార్లు కాదని బుకాయిస్తున్నారు. ఇది ఒక దేశవ్యాప్త యుద్ధం. దీని లక్ష్యం మావోయిస్టు వుద్యమాన్ని అణచివెయ్యడం. ఎందుకంటే పాలకవర్గాలు చెప్పే ప్రకారం 'మావోయిస్టు వుద్యమం దేశ ఆంతరంగిక భద్రతకు అతి పెద్ద ప్రమాదం'గా మారింది కనుక. నిజానికి ఈ ఒక్క వాక్యమే యుద్ధ ప్రకటన. మావోయిస్టు వుద్యమం బలంగా వున్నది లేదా మావోయిస్టు వుద్యమంలో ఎక్కువగా భాగస్వామ్యం వహిస్తున్నది అత్యంత అణచివేతకు, దోపిడీకి గురవుతున్న వాళ్లే అనేది అందరికీ తెలిసిన విషయమే. వాళ్లు ఈరోజు తమ కాళ్ల కింది నేలను, తమ అడవుల్ని, కొండలను, నదీనదాలను కాపాడుకోవడం కోసం జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిందని అంటూ 64 ఏళ్లు గడిచి పోయినప్పటికీ నేటికీ ప్రజలకు భూములేమీ దక్కకపోగా, తమ వద్ద ఏదో మేరకు వున్న భూముల్ని కాపాడుకోవడానికి సైతం వాళ్లు తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టాల్సి రావడం ఒక విచిత్రం. పాలకుల దృష్టిలో 'జల్–జంగల్–జమీన్'ను కాపాడుకోవడం కోసం పోరాడడమే 'ఆంతరంగిక భద్రతకు ప్రమాదకర'మైన అంశంగా మారిపోయింది.

ఈ సాకుతో ఈరోజు ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ మొదలైన రాష్ట్రాల్లో ప్రభుత్వ సాయుధ బలగాలు ప్రజలను, ముఖ్యంగా ఆదివాసులను ఊచకోత కోస్తున్నాయి. గత రెండున్నర ఏళ్లలో అవి ఒక్క దండకారణ్యంలోనే 250కి పైగా ఆదివాసులను దారుణంగా హతమార్చాయి. దీనిని బట్టి దేశవ్యాప్తంగా ఈ సంఖ్య మరెంత ఎక్కువగా వుంటుందో అంచనా వేయవచ్చు. మహిళలపై లైంగిక అత్యాచారాలు పోలీసు, అర్ధసైనిక బలగాలకు సాధారణ విషయంగా మారింది. ఇండ్లు కాల్చి వేస్తున్నారు. గ్రామాల్ని వల్లకాడులుగా మారుస్తున్నారు. ప్రజలను కాల్చి చంపుతున్నారు. తరుముతున్నారు. పట్టుకొని జైల్లల్లో బంధిస్తున్నారు. తప్పుడు కేసుల్లో ఇరికించి ఎలాంటి విచారణ లేకుండా, బెయిల్ ఇవ్వకుండా ఏండ్ల తరబడి నిర్బంధిస్తున్నారు. వాళ్లకు కఠిన శిక్షలు విధిస్తున్నారు. చట్టాలనేవి నిరుపేద దేశవాసులను అణచి వేసే సాధనాలే తప్ప మరేమీ కాదనే విషయం కళ్లకు కట్టినట్టు అర్థమవుతుండగా ప్రజలు 'కిడ్నాప్' వంటి చర్యలకు పూనుకోవల్సి వస్తున్నది.

ఈ అన్యాయ యుద్ధంలో గత ఏడాది కాలంగా సైన్యాన్ని మోహరించారు. విదేశీ శత్రువులు చేయగల దాడుల నుండి దేశాన్ని రక్షించడం కోసం సరిహద్దుల్లో వుండాల్సిన సైనికులను దేశం నడి మధ్యన 'శత్రువుల'తో పోరాటం కోసం మోహరించారు. అయితే దీన్ని మోహరింపు అని చెప్పకుండా 'శిక్షణ' సాకుతో ఒక బ్రిగేడ్ సంఖ్యలో సైన్యాలను ఇక్కడికి తరలించారు. ఇది నిజమని నమ్మెయ్యడానికి దేశ ప్రజలు మూర్ఖులని దేశ పాలకులకు నమ్మకం. వాస్తవానికి విప్లవోద్యమ అణచివేతలో సైన్యం పాత్రను దాదాపు 7–8 ఏండ్లుగా చూడవచ్చు. ఇంతే కాదు, 'ఆత్మరక్షణ' పేరుతో సైన్యానికి ఇచ్చిన అనేక అధికారాల్లో చాలా వరకు క్రూర ఏ.ఎఫ్.ఎస్.పి.ఏ. (సాయుధ బలగాల ప్రత్యేకాధికారాల చట్టం) కిందకు వచ్చేవే. వాయుసైనిక హెలికాప్టర్లను ఉపయోగించడం కూడా చాలా కాలం నుండి కొనసాగుతున్నది. ఇప్పుడు వాయుసైన్యం కోసం ఏయిర్‌బేస్‌లను నిర్మిస్తున్నారు. సైన్యానికి చెందిన ఛత్తీస్‌గఢ్–ఒడిశా సబ్–ఏరియా కమాండ్ హెడ్‌క్వార్టర్స్ కార్యాలయాన్ని రాయపూర్‌లో ప్రారంభించారు. బిలాస్‌పూర్‌కు దగ్గరలో సైనిక కంటోన్మెంట్ నిర్మాణం జరుగుతున్నది. సైన్యంలోకి భర్తీ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే త్వరలోనే భారత ప్రభుత్వ సైన్యం 'ప్రజలపై యుద్ధం'లో క్రియాశీల పాత్ర పోషించబోతున్నది. దీంతో ఇక్కడి ప్రజలపై సాగుతున్న దమనకాండ ఏ స్థాయికి పెరిగిపోతుందో ప్రస్తుతం ఊహ మాత్రమే చెయ్యగలం.

అసలు ఈ యుద్ధానికి ఎందుకింత త్వరపడుతున్నారు? ఎందుకంటే దేశంలోని మిగతా అన్ని ఆదివాసీ ప్రాంతాల వలెనే దండకారణ్యం కూడా ఎన్నో విలువైన ప్రకృతి సంపదల ఖజానా. దీన్ని కొల్లగొట్టడం కోసం దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల కార్పొరేట్

కంపెనీలు పదరాని పాట్లు పడుతున్నాయి. 2008 నుండి నెలకొన్న ప్రపంచవ్యాప్త సంక్షోభం నేపథ్యంలో అవి మన దేశంలోని సహజ సంపదల్ని దోచుకోవడానికి మరింత దూకుడుగా ప్రయత్నిస్తున్నాయి. టాటా, ఎస్సార్, జిందల్, మిత్తల్, వేదాంత, జయస్వాల్స్ నెకో వంటి కార్పొరేట్ కంపెనీలు ఈ ప్రాంతాల్లో వేగంగా చొరబడుతున్నాయి. మన దేశ దళారీ పాలకులు వాటి ముందు సాగిలబడుతున్నారు. కోట్లాది రూపాయల ముడుపులకు బదులు వీళ్లు దేశ సంపదలనే కాదు, సార్వభౌమత్వాన్ని కూడా కుదువ బెట్టడానికి వెనుకాడరు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులతో పాటు మంత్రులు, నేతలందరూ ఈ దోపిడీలో తమ వాటా చేజిక్కించుకోవడం కోసం వెంపర్లాడుతున్నారు. కానీ ప్రజలు దీన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎందుకంటే ఈ నిలువుదోపిడీకి అనుమతివ్వడమంటే 'జల్–జంగల్–జమీన్' వినాశనమే, కోట్లాది ప్రజల విస్థాపనే. ఒక్క మాటలో అది ప్రజల సంపూర్ణ వినాశనం. ప్రజల ప్రతిఘటనా పోరాటంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ముందు వరుసలో నిలబడింది. దీని ఫలితంగా ఈరోజు లక్షల కోట్ల రూపాయల ఎం.ఓ.యు.లు అమలు కావడం లేదు. దీంతో కార్పొరేట్ సంస్థలు, వాళ్ల ప్రభువులైన సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదులు గంగవెర్రులెత్తారు. ఎందుకంటే అనేక చోట్లలో గనుల తవ్వకం పనులు నిలిచిపోయాయి. మైనింగ్ మాఫియాను ప్రజలు తన్ని తరిమేస్తున్నారు. అనేక భారీ పరిశ్రమల పనులు నిలిచిపోయాయి. అనేక భారీ డ్యాంల నిర్మాణం ఆగిపోయింది.

పాలకులు తమ దోపిడీ విధానాలకు 'అభివృద్ధి' ముసుగు తొడిగించి తమ కార్పొరేట్ మీడియా ద్వారా పెద్ద ఎత్తున దుష్ప్రచార క్యాంపెయిన్ నడిపిస్తున్నారు. మరోవైపు మావోయిస్టులను 'టెర్రరిస్టులు'గా, 'అభివృద్ధిని అడ్డుకునేవాళ్లు'గా ప్రచారం చేస్తూ తమ అమానవీయ యుద్ధాన్ని సమర్థించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మా పార్టీ నాయకత్వంలో దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్ సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ప్రాథమిక స్థాయిలో నిర్మించుకుంటున్న ప్రజాస్వామిక రాజ్యాధికార అంగాలతో కూడా దోపిడీ పాలకులు పిచ్చెత్తిపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, తదితర అభివృద్ధి నిరోధక శక్తుల అధికారాన్ని ధ్వంసం చేస్తూ పీడిత ప్రజలు నిర్మించుకుంటున్న 'క్రాంతికారీ జనతన సర్కార్' లేదా 'విప్లవ ప్రజా కమిటీ'తో ప్రస్తుత భూస్వామ్య, దళారీ పెట్టుబడిదార్ల రాజ్యాధికారానికి ముఖాముఖి సవాలు ఎదురవుతున్నది. ప్రజలు ముందుకు తెస్తున్న ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా సామ్రాజ్యవాద ప్రాయోజిత బూటకపు అభివృద్ధి నమూనాతో పోటీ పడుతున్నది.

సరిగ్గా ఈ కారణంగానే మావోయిస్టు వుద్యమం దేశ పాలకవర్గాలకు, వాళ్ల యజమానులైన సామ్రాజ్యవాదులకు అతి పెద్ద 'ప్రమాదం'గా మారింది. ఇందువల్లనే వాళ్లు దీన్ని నిర్మూలించడానికి ఈ యుద్ధాన్ని మొదలుపెట్టారు. ఇప్పుడీ యుద్ధం ఎంతో హింసాత్మకంగా, భయానకంగా పరిణమిస్తున్నది. 3 నుండి 5 వేల సంఖ్యలో రాష్ట్ర పోలీసులు, సి.ఆర్.పి.ఎఫ్.–కోబ్రాలు, కమాండోలు, కోయ కమాండోలు సైనిక తరహాలో భారీ ఎత్తున దాడులకు పాల్పడుతున్నారు. ఇవి రానున్న రోజుల్లో సైన్యం ప్రత్యక్షంగా నిర్వహించబోయే ఆపరేషన్లకు రిహార్సల్సే తప్ప మరేమీ కాదు. అక్టోబర్ 2011లో గడ్చిరోలి జిల్లాలోని ధనోర తాలూకాలో, 2011 నవంబర్ 24 నుండి 27 వరకు బస్తర్‌లోని బీజాపూర్ ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్లు, 19 డిసెంబర్‌న దక్షిణ బస్తర్ ప్రాంతంలోని కేడవాల్ గ్రామంపై హెలికాప్టర్ల ద్వారా నిర్వహించిన భారీ దాడుల్లో వేలాది సాయుధ బలగాలు పాల్గొన్నాయి. 2012 ఫిబ్రవరిలో బీజాపూర్ జిల్లాలోని గంగలూరు ప్రాంతంలో నిర్వహించిన ఆపరేషన్, మార్చ్‌లో మాడ్ ప్రాంతంలో జరిపిన 'ఆపరేషన్ విజయ్', 'ఆపరేషన్ హాకా'లు కూడా ఈ కోవలోకే వస్తాయి. వీటన్నిటిలో బ్రిగేడ్ సంఖ్యలో సాయుధ బలగాలను ప్రయోగించారు. ఈ ఆపరేషన్లన్నిటి సందర్భంగా ప్రజలపై అమానవీయ హింస, విధ్వంసం, హత్యలు, మహిళలపై లైంగిక అత్యాచారాలు, విచ్చలవిడి అరెస్టులు జరిగాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆపరేషన్ గ్రీన్‌హంట్ లేదా 'ప్రజలపై యుద్ధం' కేవలం మావోయిస్టు వుద్యమ ప్రాంతాలకు పరిమితమైనది కాదు. ఇది దేశంలోని ప్రజలందరిపై యుద్ధం. దేశంలోని సహజ సంపదలను, వనరులను అన్నిటినీ కొల్లగొట్టడానికి మార్గం సుగమం చెయ్యడం, ఒక ప్రత్యామ్నాయంగా పుట్టి పెరుగుతున్న ప్రజల ప్రజాస్వామిక రాజ్యాధికారం గొంతు నులిమెయ్యడం ఈ యుద్ధం లక్ష్యం. కార్పొరేట్ దోపిడీకి అడ్డు నిలిచిన ప్రతి వ్యక్తినీ, ప్రతి సంస్థను ఈ రాజ్యం తన శత్రువుగా పరిగణిస్తున్నది. కాబట్టి ఈ యుద్ధాన్ని ఆపాలి. ఇందులో సైన్యం మోహరింపును అడ్డుకోవాలి. ఇలా మనం చెయ్యగలం కూడా.

కనుక, 2012 జూన్ 1 నుండి 7 వరకు దండకారణ్యం ఎల్లెడలా 'నిరసన వారం' పాటించండి. దేశ ప్రజలపై సాగుతున్న అన్యాయ యుద్ధం – ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపాలని, బస్తర్‌లో సైన్యం 'శిక్షణ'ను నిలిపివేసి దాన్ని ఇక్కడి నుండి వెనక్కి పంపించాలనే డిమాండ్లతో ఎల్లెడలా సభలు, ప్రదర్శనలు, ఊరేగింపులు, చక్కాజాం తదితర కార్యక్రమాలు నిర్వహించాలి. జూన్ 7న 24 గంటల పాటు 'దండకారణ్య బంద్'ను విజయవంతం చేయాలి.

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి,**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**